సాక్షి
కాకినాడ
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



వరద ముంచేను

వరద వచ్చింది.. నిండా ముంచేసింది.. లంకలను అతలాకుతలం చేసింది.. చివరికి వెనక్కి తగ్గినా బురదే మిగిల్చింది.. ఈ ఏడాది గోదావరికి మూడు సార్లు వరద వచ్చింది.

8లో



కొత్త కోటపాడులో డయేరియా

మండలంలోని కొత్త కోటపాడు గ్రామంలో డయేరియా ప్రబలింది. వాంతులు, విరేచనాలతో పలువురు మంచాన పడ్డారు.

4.55 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం రాత్రి 4,55,627 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. సోమవారం రాత్రి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 14,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

11న జాబ్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): **జిల్లా ఉపాధి** కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన **జాబ్‌మేళా** నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనా**ధికారి జి.శ్రీని**వాసరావు సోమవారం తెలిపారు. **ఎయిర్‌టెల్** పేమెంట్ బ్యాంక్, పేటీఎం సంస్థ**లు 220 ఉద్యో**గాలకు ఇంటర్వ్యూలు నిర్వహి**స్తున్నాయని,** పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు **హాజరుకా**వాలని సూచించారు. ఇతర వివరా**లకు 98398 46568** నంబరులో సంప్రదించవ**చ్చన్నారు.**

జాతీయ ఎస్టీ కమిషన్ సమన్లు జారీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ ఎస్టీ కమిషన్ సూచనల మేరకు ఢిల్లీ ఎస్సీఎస్టీ కోర్టుకు ఈ నెల 9వ తేదీన హాజరుకావాలంటూ ఉన్నత విద్య ప్రిన్సిపాల్ కార్యదర్శికి సమన్లు జారీచేసింది. గ్రంథాలయ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ హోదా ఇవ్వాలంటూ బీఆర్ దొరస్వామినాయక్ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించడంతో దీనిపై స్పందించిన కమిషన్ హాజరుకావాలంటూ సమన్లు జారీ చేసింది.

పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పీజీఆర్ఎస్ అర్జీలు గడువులోగా పరిష్కరించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. కలెక్టర్, జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్‌లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 480 అర్జీలు అందాయన్నారు.

తెరచుకున్న సత్యదేవుని ఆలయ ద్వారాలు

అన్నవరం: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూత పడిన సత్యదేవుని ఆలయాన్ని సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. స్వామివారి వ్రతాలు, నిత్యకల్యాణం, ఆయుష్య హోమం, సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ, పంచహారతుల సేవ, రాత్రి పవళింపుసేవ యథావిధిగా నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు మాత్రమే స్వామివారి ఆలయానికి విచ్చేశారు. స్వామివారి వ్రతాలు మూడు వందలు జరిగాయి.

అప్పనపల్లిలో దర్శనాలు పునః ప్రారంభం



అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం గోదావరి జలాలతో ఆలయాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ కార్యక్రమాలు, నిత్య కైంకర్యాల అనంతరం భక్తుల దర్శనాలు పునః ప్రారంభించారు. స్వామివారి సన్నిధిలో నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమం జరిపారు. స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

బిక్కవోలు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన ఆందోళనకారులు

అనపర్తి : మహిళలపై దాడి చేసి గాయపరిచిన నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించకుండా అదుపులోకి తీసుకుని స్వేచ్ఛగా వదిలేశారని ఆరోపిస్తూ ఊలపల్లి గ్రామానికి చెందిన బాధిత వర్గానికి చెందిన వారు సోమవారం భారీగా తరలివచ్చి బిక్కవోలు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ నెల 6న వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవలో మరో వర్గానికి చెందిన వారిపై అందిన ఫిర్యాదు మేరకు బిక్కవోలు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే నిందితులపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు వారిని వదిలేశారని ఆరోపిస్తూ బాధిత వర్గం ఆందోళన వ్యక్తం చేసింది. అనపర్తి సీఐ సుమంత్ ఆందోళనకారులతో చర్చలు జరిపి నిందితులను అదుపులోకి తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

యూరియా...ఏదయ?

- **అదను దాటిపోతున్నా అగచాట్లే**
- **కనికరం లేని కూటమి సర్కారు**
- **లెక్కలకు, వాస్తవానికి లేని పొంతన**
- **రేపు మాపు అంటూ తిప్పుతున్న వైనం**
- గగ్గోలు పెడుతోన్న ఖరీఫ్ రైతు



సామర్లకోట సొసైటీ వద్ద ఎరువుల కోసం రైతుల తోపులాట (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: యూరియా కొరతతో రైతులు అల్లాడిపోతున్నారు. ఖరీఫ్ సాగు ముందస్తు ప్రణాళికలో వైఫల్యం జిల్లాలో రైతుల కొంప ముంచింది. జిల్లాలో ఏ ప్రాంతంలోనూ బస్తా యూరియా దొరకడం లేదు. వ్యవసాయ శాఖాధికారులను అడుగుతుంటే ర్యాక్‌ల ఇండెంట్‌లు పెట్టారు, రేపు వస్తాయి, మాపు వస్తాయి అంటూ రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. జిల్లాలో యూరియా లభ్యతపై అధికారులు చెప్పే లెక్కలకు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితికి అసలు పొంతన కుదరడం లేదు. జులై నెలాఖరున నాట్లు పూర్తి అయిన ఆయకట్టుల్లో ఇప్పటి వరకు రెండో విడత యూరియా వేసిన దాఖలాలు కనిపించడం లేదు. వాస్తవానికి ఈ సరికే రెండోసారి యూరియా వేయాల్సి ఉన్నా అందుబాటులో లేక దేవుడిపై భారం వేసి వరి పంట గాలికొదిలేయాల్సి వచ్చిందని రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో ఏ మండలంలో ఏ ఆయకట్టులో రైతును కదిపినా కొందామంటే యూరియా లేదని ఘొల్లుమంటున్నారు. కాకినాడ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2.10 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఆగస్టు నెల నాటికి జిల్లాలో దాదాపు అన్ని ఆయకట్టుల్లోను వరి నాట్లు పూర్తయ్యాయి.

ఒకటి లేక రెండు బస్తాలే

ప్రస్తుతం రైతులు ఎకరాకు ఒక బస్తా యూరియా, ఒక బస్తా కాంప్లెక్సు ఎరువు వేస్తున్నారు. జులై నెలలో వరి నాట్లు వేసిన రైతులు కూడా ప్రస్తుతం రెండవ విడత ఎరువులు వేయాల్సి ఉన్నా ఎరువుల కొరతతో అదను దాటిపోతోందని ఘొల్లుమంటున్నారు. జిల్లా అంతటా యూరియా కొరత రైతులను వేధిస్తోంది. ఇతర కాంప్లెక్సు ఎరువులు అవసరానికి మించి ఉన్నాయి. రైతులకు అవసరమైన యూరియా మాత్రం అందుబాటులో లేదు. ప్రభుత్వం కనీసం యూరియా కూడా ఇవ్వలేని దయనీయ పరిస్థితిలో ప్రభుత్వం ఉందని రైతులు మండిపడుతున్నారు. రైతు ఎన్ని ఎకరాలు సాగు చేశారనే దానితో సంబంధం లేకుండా ఒకటి, రెండు బస్తాలు మించి యూరియా ఇవ్వడంలేదు. ఐదారెకరాలు సాగు చేసిన రైతుకు కూడా ఒకటి, రెండు బస్తాలంటే ఎలా అని రైతు ప్రతినిధులు నిలదీస్తున్నారు.

అధికారుల 'స్టాక్' రిప్లై!

జిల్లాలో రైతుల అవసరాలకు తగ్గట్టు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు ఊరూవాడా ఊదరగొడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియాకు కూడా జిల్లాలో ఎక్కడా ఇబ్బంది లేదని అధికారులు చెబుతుంటే ఎక్కడా చూసినా ఒక్క బస్తా మించి యూరియా ఇవ్వలేని దుస్థితిలో వ్యవసాయశాఖ ఉంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 23,360 మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంటే ఇప్పటి వరకూ 19,046 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. కానీ జిల్లాలో ఏ వ్యవసాయ సబ్ డివిజన్‌లో పరిశీలించినా గడచిన నాలుగైదు రోజులుగా యూరియా స్టాక్ లేదనే సమాధానం ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ర్యాక్‌లు బుక్ అయ్యాయి, రెండు, మూడు రోజుల్లో యూరియా వస్తుందని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

జగ్గంపేట, గండేపల్లి మండలాలకు సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు, అక్టోబర్ మొదటి వారానికి కలిపి 900 టన్నుల యూరియా అవసరమని లెక్క లేశారు. ప్రస్తుతం రైతులకు 25 టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని చెబుతున్నారు. వచ్చే రెండు రోజుల్లో 200 టన్నులు వస్తుంది అని అధికారులు చెబుతున్నారు. తుని మండలానికి 1,100 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటి వరకు 750 మెట్రిక్ టన్నుల యూరియా అందజేశామని అక్కడి వ్యవసాయాధికారి చెబుతున్నారు. మరో వంద మెట్రిక్ టన్నులు శనివారం అందుబాటులోకి వస్తుందంటున్నారు. వ్యవసాయంలో ఎప్పుడు చేయాల్సిన పనులు అప్పుడే చేయాలి లేకుంటే కోలుకోలేని రీతిలో నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు.

సకాలంలో ఎరువులు వేయకపోయినా చేను దుబ్బు కట్టక, దిగుబడులు తగ్గిపోతాయి. అధికారులు యూరియా కొరత లేదని ప్రకటనలు ఇస్తున్నారే కానీ, వాస్తవానికి యూరియా ఎక్కడా దొరకడం లేదు. వారం రోజుల క్రితం కరప మండలం జెడ్.భావారం రైతు సేవా కేంద్రానికి వచ్చిన 225 బస్తాల యూరియా స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో దింపించారు. తీరా అక్కడి అధికార పార్టీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా తమ అనుచరులకు ఏకంగా 125 బస్తాలు ఇచ్చేశారు. రైతులు రోడ్డెక్కి గొడవ చేస్తే మిగిలిన 100 బస్తాలు రైతులకు ఇచ్చారు. పిఠాపురం నియోజవర్గం మొత్తానికి 4,175 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇప్పటికి 3037.55 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. మరో 933 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇటీవల గొల్లప్రోలు మండలంలో యూరియా కోసం రోడ్డెక్కి ఆందోళన చేసినా వ్యవసాయశాఖ స్పందన నామమాత్రంగానే ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతుపోరుకు తరలి రండి



యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటోన్న కష్టాలను కూటమి సర్కార్ దృష్టికి తీసుకువెళ్లేలా మంగళవారం ఆర్డీఓ కార్యాలయాల వద్ద తలపెట్టిన రైతు పోరు కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కేంద్రం కాకినాడ ఆర్డీఓ, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి విజ్ఞాపన పత్రాలు అందచేయనున్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయానికి ఆ డివిజన్ పరిధిలోని ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని, పెద్దాపురం నియోజకవర్గాలకు చెందిన పార్టీ కోఆర్డినేటర్‌లు, పార్టీ నేతలు, శ్రేణులు, రైతులు కలిసి వెళ్లనున్నారు. ఇక్కడి కార్యక్రమానికి వైఎస్సార్ సీపీజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో నిర్వహించేలా నిర్ణయించారు. కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో విజ్ఞాపన అందచేసే కార్యక్రమానికి కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్‌లు, పార్టీ నేతలు, రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పిఠాపురం కోఆర్డినేటర్, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగా గీత విజ్ఞప్తి చేశారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజా

పంట నష్టపోతాం



నేను ఈ ఖరీఫ్ సీజన్లో 3.50 **ఎకరాలు సాగు చే**స్తున్నాను. **సీజన్ ప్రారంభంలో** కాలువలకు సాగునీరు **రావడం రెండువారాలు** ఆలస్యమైంది. వర్షాలు **పడక వరినాట్లు వే**యడంలో ఆలస్యమైంది. **ప్రారంభంలోనే యూ**రియా దొరకక డీఏపీ **వేశాను. వరినాట్లు వే**సి ఐదు వారాలైంది. చేను **పిలకలు తొడిగి, దు**బ్బు కట్టే దశలో ఉంది. **ఇప్పుడు యూరియా,** పొటాష్ ఎరువులు **వేయాల్సి ఉంది.** ప్రైవేటు దుకాణాలలో కానీ, **రైతు సేవాకేంద్రాలలో** కానీ యూరియా దొరకక చాలా ఇబ్బంది పడుతున్నాం. అవసరమైనప్పుడే ఎరువులు వేయాల్సి ఉంటుంది. తర్వాత ఎన్నిబస్తాలు ఇచ్చినా ఉపయోగం ఉండదు. వర్షం పడినా, వర్షం నీటిలో ఉండే నత్రజని కొంతవరకు చేనుకు ఉపయోగపడుతుందనుకుంటే, వేసవికాలం మించిన ఎండలు కాస్తుండటంతో చేను ఎదుగుదల ఉండటంలేదు. యూరియా వస్తుందో, లేదోనని భయం వెంటాడుతోంది.

– సొడగం సూరిబాబు, రైతు, అరట్లకట్ట, కరప మండలం

ఒక బస్తా యూరియా కూడా ఇవ్వలేదు



నాకు మొత్తం 10 ఎకరాల భూమి ఉంది. నాది జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామం. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మా భూములకు నీరు వస్తుంది. ప్రస్తుతం అది పనిచేయకపోవడంతో కేవలం వర్షాధారం మీద నాలుగు ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశాం. నాకు మొత్తం 15 బస్తాల యూరియా అవసరం. నాలుగు ఎకరాల వరి పంటకు ఒక బస్తా యూరియా కూడా ఇప్పటి వరకు వేయలేకపోయాను. బయట మార్కెట్లో గాని, రైతు సేవాకేంద్రాల్లో గాని యూరియా దొరకట్లేదు... యూరియా దొరుకుతుందో లేదో అన్న భయం పట్టుకుంది.

– కర్నాకుల వెంకటరావు, రైతు, కాండ్రేగుల జగ్గంపేట మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



ఆరు ఎకరాల వరి సాగు చేస్తున్నాను. చేను మూన తిరిగింది. రెండుసార్లు పిండి వేశాను. ఇంకో పది రోజుల్లో మరోసారి పిండి వేయాల్సి వుంది. పిండికోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత నెల 25న సొసైటీ సిబ్బంది ఊళ్లో పిండి ఇచ్చారు. ఒక ఆధార్‌కి ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు. పిండి కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– ఓబిన్ని రామదాసు, తాళ్ళూరు, గండేపల్లి మండలం.

దారీ తెన్నూలేని పరిస్థితి



యూరియాకు దారీ తెన్నూ లేకుండా ఉంది. ఈ ఖరీఫ్‌లో నేను 18 ఎకరాల సాగు చేస్తున్నాను. కనీసం 18 బస్తాల యూరియా కావాలి. అయితే ఇప్పటి వరకు నా వరకు ఒక్క బస్తా కూడా యూరియా దక్కలేదు. గత్యంతరం లేక లిక్విడ్ యూరియాను కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నా. ఇది ఎంతవరకు పనిచేస్తుందో తెలియని పరిస్థితి ఉంది. లిక్విడ్ యూరియాపై నమ్మకం లేదు. యూరియా లభించకపోవడంతో దీనిని ఉపయోగిస్తున్నాను. అదను దాటిపోతే యూరియా వేసినా ప్రయోజనం ఉండదు.

– తాటికొండ అచ్చిరాజు, రైతు, నవర, సామర్లకోట మండలం

అవసరానికి అందకపోతే అనర్థమే



నేను రెండున్నర ఎకరాలు సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు పంటకు యూరియా కనీసం రెండు బస్తాలు కావలసి ఉంది. అయితే యూరియా లభించకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పంట పిలకలు వేసుకునే దశలో ఉంది. ఈ దశలో తప్పనిసరిగా యూరియా వేయవలసి ఉంది. అదను దాటిపోయాక యూరియా వేయడం వల్ల దోమ ఆశించే ప్రమాదం ఉంది. పంటకు కావలసిన యూరియా కోసం డీలర్లను బతిమాలి రూ.263 ఉన్న యూరియా బస్తా రూ.350కు కొనుక్కోవాల్సిన పరిస్థితి. గతంలో ఎన్నడూ ఇటువంటి యూరియా కొరత ఏర్పడలేదు.

– వెలమర్తి శ్రీనివాస్, రైతు, వీకేరాయపురం, సామర్లకోట మండలం

బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లాలో యూరియా బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అనధికారికంగా నిల్వ ఉంచిన వారిపై 6ఏ కేసు నమోదు చేసి 158.8 మెట్రిక్ టన్నులు సీజ్ చేశాం. జిల్లాలోని రైతుల అవసరాలకు సరిపడా యూరియా శనివారం జిల్లాకు రానుంది. వివిధ మండలాలకు ఈ యూరియా పంపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉంటుంది. యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అనధికారికంగా నిల్వచేసినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– షణ్మోహన్ సగిలి, కలెక్టర్

ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కు తీసుకోవాలి

మాజీ ఎంపీ చింతా మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కు తీసుకోవాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. కాకినాడలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ హఠాన్మరణం తరువాత ఉమ్మడి రాష్ట్ర సీఎంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజ నరసింహంను నియమించి ఉండి ఉంటే అసలు రాష్ట్ర విభజన జరిగి ఉండేదే కాదన్నారు. అప్పట్లో దూరాలోచన లేకుండా కిరణ్‌కుమార్‌రెడ్డిని సీఎం చేయడం పొరబాటు అన్నారు. ఆ ప్రాంతంలో మాదిగలు కేసీఆర్ వెనుక మద్దతుగా నిలవడంతోనే ఆ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉండగానే చంద్రబాబు 20 శాతం ఓటింగ్ ఉన్న ఎస్సీల కోసం వర్గీకరణ చిచ్చుపెట్టారని మోహన్ విమర్శించారు. ఆ ఓట్లలో కొన్నింటినైనా తన పార్టీకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతోనే ఎస్సీలను వర్గాలుగా విభజించారన్నారు. చంద్రబాబు పాలన అట్టర్ ఫెయిల్యూర్ అని విమర్శించారు. చంద్రబాబు పతనం మొదలైందన్నారు. అమరావతిలో రైతులను పీడించి బలవంతంగా వందల ఎకరాలు లాగేసుకుని కోటీశ్వరులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. 70వేల ఎకరాలు అమరావతి నిర్మాణం కోసం కోటీశ్వరులకు కేటాయించే సందర్భంలో బెంగళూరులో వారి మధ్య జరుగుతోన్న లావాదేవీలు మాటేమిటని చింతా ప్రశ్నించారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన 17 వైద్య కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసేందుకు చంద్రబాబు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. బిర్లా, టాటాలను కలిశాను, సింగపూర్, దుబాయ్ వెళ్లాను అని చెబుతున్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు ఏమి తీసుకువచ్చారో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల కమిషన్ భ్రష్టు పట్టిన కమిషన్‌గా మారిపోయిందని విమర్శించారు.

సిబ్బందితో గొడవలొద్దని ఈఓకు ఆదేశాలు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సిబ్బందితో సమన్వయం చేసుకుని పాలన సాగించాలని, చిన్న చిన్న కారణాలతో సిబ్బందితో ఘర్షణ పడవద్దని ఈఓ వీర్ల సుబ్బారావును దేవదాయశాఖ కమిషనర్ కే రామచంద్రమోహన్ సోమవారం ఆదేశించారు. దేవస్థానంలో ఈఓ కుటుంబ సభ్యుల జోక్యం, సిబ్బందిని అవమానించేలా ఈఓ మాట్లాడడం వంటి వాటిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాంతో కొందరు సిబ్బంది సెలవుకు దరఖాస్తు చేయడం, కొంతమంది వీఆర్ఎస్ తీసుకునేందుకు నిర్ణయించడం వంటివి జరిగాయి. ఆ సందర్భంగా గత ఏప్రిల్ 16వ తేదీన సాక్షి దినపత్రికలో 'చినబాబొచ్చారు బహుపరాక్' శీర్షికన,



చిన్నబాబు వచ్చారు.. బహుపరాక్!

ఏప్రిల్ 16న సాక్షిలో ప్రచురితమైన కథనం

అదే నెల 18వ తేదీన 'నీ కొలువుకు సెలవు స్వామీ' శీర్షికన వార్తలు ప్రచురితమయ్యాయి. ఆ వార్తలకు స్పందించిన దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఈఓ వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలపై, సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తలపై విచారణ



సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

చేయాలని అడిషనల్ కమిషనర్ ఎస్.చంద్రకుమార్‌ను ఆదేశించారు. ఆయన ఏప్రిల్ 27న విచారణ జరిపి తన నివేదికను కమిషనర్‌కు సమర్పించారు. విచారణలో ఈఓ వ్యవహార శైలిపై సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి ఉన్న విషయం వాస్తవమేనని తేలిందని కమిషనర్ తన ఆదేశాలలో పేర్కొన్నారు. దేవస్థానంలో సిబ్బంది తో సమన్వయం చేసుకుని భక్తులకు ఇబ్బంది కలుగకుండా సేవలందించడం ఈఓ ప్రథమ కర్తవ్యమని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. సిబ్బందితో వివాదాలు లేకుండా పరిపాలన సాగించాలని ఈఓను ఆదేశించారు.

ఆటిజం.. అవగాహనతో దూరం

- బాల్యంలో వేధిస్తున్న మందబుద్ధి సమస్య
- ప్రతి వంద మందిలో ఇద్దరికి వచ్చే అవకాశం
- జిల్లాకు నాలుగు ఆటిజం కేంద్రాలు మంజూరు



క్రీడల్లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగ చిన్నారులను అభినందిస్తున్న డీఈఓ డాక్టర్ సలీం బాషా (ఫైల్)

రాయవరం: పేరు పెట్టి పిలిచినా పలకక పోవడం, ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం, వారి వైపు చూసి నవ్వినప్పుడు తిరిగి నవ్వకపోవడం, చేసిన పనినే మళ్లీ మళ్లీ చేయడం, మిగిలిన చిన్నారులతో కలవకపోవడం వంటి లక్షణాలు ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో కనిపిస్తుంటాయి. జన్యుపరమైన, ఇతరత్రా వివిధ కారణాలతో మన దేశంలో ప్రతి వంద మంది పిల్లల్లో ఇద్దరు ఇటువంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పరిశోధనల్లో వెల్లడైంది. కోవిడ్ తర్వాత ఆటిజం లక్షణాలు ఉన్న చిన్నారులు అధికమయ్యారని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం భవిత కేంద్రాల ఆధ్వర్యంలో ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించింది. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు నాలుగు ఆటిజం కేంద్రాలు మంజూరు చేశారు. జిల్లాలో 22 మండలాల్లో ఇప్పటికే 22 భవిత కేంద్రాలు ఉన్నాయి.

వారిలోనూ నైపుణ్యాలు

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోలుస్తుంటారు. వారిలా ఉండమని చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల ఆటిజం సమస్యలు తగ్గుతాయని భావిస్తుంటారు. ఈ పద్ధతి ఏ మాత్రం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. అలాగే ఆటిజం ఉన్నవారిలో కూడా ఎన్నో నైపుణ్యాలు ఉంటాయి. ఇలా ఆటిజం ఉన్నప్పటికీ అద్భుతమైన విజయాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు. అందుకే ఈ చిన్నారుల్లో ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉంది.

భవిత కేంద్రాల తరహాలో..

జిల్లా పరిధిలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలో ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు సమగ్ర శిక్షా అధికారులు చర్యలు చేపట్టారు. ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాల్లో తరహాలోనే ఈ కేంద్రాల్లో ఆటిజం బాధితులకు సేవలు అందిస్తారు. బాధిత చిన్నారులను పూర్వపు స్థితికి తీసుకువచ్చి అందరిలో కలిసేలా చేసేందుకు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలోనే వీటికి ప్రత్యేక భవనాలు నిర్మించడంతో పాటు సిబ్బందిని నియమించే అవకాశముంది. ఒక్కో భవనానికి రూ.27.75 లక్షల చొప్పున అందజేయనున్నారు. ఈ నిధులతో రెండు గదులు నిర్మిస్తారు. ఫిజియోథెరపీ, ఆటపాటలతో కూడిన బోధన అందించనున్నారు. ఆటిజంతో బాధపడే చిన్నారులను తీసుకు వచ్చేందుకు రవాణా సౌకర్యం(బస్టాండ్) ఉన్న ప్రదేశాలకు దగ్గరలోనే కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

మానసిక పరిస్థితి మెరుగు

ప్రస్తుతం భవిత కేంద్రాల్లో ఆటిజంతో బాధపడే చిన్నారులకు కూడా సేవలందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు, ఆటిజం బాధితులకు ఒకేచోట సేవలు అందించడం ఇబ్బందిగా మారడంతో ఆటిజంకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. స్పీచ్ లాంగ్వేజ్, వ్యక్తిగత ప్రవర్తన, ఆక్యుపేషనల్, మ్యూజిక్ థెరపీ శాస్త్రీయంగా సాధన చేయించనున్నారు. ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించి చికిత్స చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

త్వరలో ఏర్పాటు చేస్తాం



జిల్లాకు నాలుగు ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాయి. ఈ కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై పరిశీలన చేస్తున్నాం. వచ్చే చిన్నారులకు అనువుగా సెంటర్లను ఎంపిక చేయనున్నాం. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

– జి.మమ్మీ, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, జిల్లా సమగ్ర శిక్షా అభియాన్

పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి



జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆదాయం తక్కువ ఉన్న మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు ఇవ్వాల్సిన 11 నెలల గౌరవ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ ముస్లిం విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్‌కే కరీంబాషా డిమాండ్ చేశారు. ముస్లిం విభాగం కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి బాషా అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రతి నెలా మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ కొన్ని నెలలుగా గౌరవ వేతనం అందించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024 మార్చి వరకు గౌరవ వేతనాలు మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం నాలుగు నెలలు మాత్రమే వేతనాలు చెల్లించిందన్నారు. పార్టీ ముస్లిం విభాగం సిటీ అధ్యక్షుడు కాలిద్ బిన్ వాలిద్, మాజీ వాక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షుడు రెహమాన్ ఖాన్, హేమంత్, మాజీ కార్పొరేటర్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు అజ్జు, మయూరి అలీషా, చాంద్ భాషా, ఇర్ఫాన్, నౌషద్, కిషోర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త హత్య కేసులో అరెస్ట్

అమలాపురం రూరల్: వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్త తలపై ఇనుప రాడ్డుతో మోది హత్య చేసిన భార్యను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు వివరించారు. నడిపూడి బైపాస్ రోడ్డులోని మెట్ల రాంజీ కాలనీలో ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి సమయంలో కాకినాడ హెడ్ క్వార్టర్స్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్న దొమ్మేటి రాంబాబు (61)ను భార్య వెంకటరమణ హత్య చేసిన విషయం తెలిసిందే. మృతుని బంధువు దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వెంకటరమణను కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ వివరించారు.

బంగారు ఆభరణాల చోరీ

నల్లజర్ల: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు ప్రవేశించి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన తెలికిచెర్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పైడిమర్రి రాజేశ్వరి, వెంకటకృష్ణలు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 24 గ్రాముల బంగారు ఆభరణాలు కనబడలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వరద ముంచేను

- గోదావరి తగ్గడంతో కోలుకుంటున్న లంకలు
- పంటల సంరక్షణకు జాగ్రత్తలు అవసరం

అలమూరు: వరద వచ్చింది.. నిండా ముంచేసింది.. లంకలను అతలాకుతలం చేసింది.. చివరికి వెనక్కి తగ్గినా బురదే మిగిల్చింది.. ఈ ఏడాది గోదావరికి మూడు సార్లు వరద వచ్చింది.. లంకల్లో వందల ఎకరాల పంటలను నీట నాన్చింది. చాలాచోట్ల పంట ఎందుకు పనికి రాకుండా పోయింది. మిగిలిన పంటలను రక్షించుకునేందుకు ఉద్యాన రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గోదారమ్మ శాంతించడంతో ఇప్పుడిప్పుడే లంక భూములు కోలుకుంటున్నాయి. వరద తాకిడికి గురైన ఉద్యాన పంటలను జాగ్రత్తగా కాపాడుకోకపోతే నష్టం తప్పదు. ఒక్కోసారి వివిధ రకాల తెగుళ్లు సోకి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నీట మునిగిన పంటను ఏవిధంగా సంరక్షించుకోవాలో వివరిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట, మండపేట, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో వందలాది ఎకరాల కూరగాయల పంటలు వరద నీటి నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఈ పంట భూముల్లో వరద నీరు ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండడంతో జింక్, పొటాష్, నత్రజని పోషకాలతో పాటు ఇనుము ధాతు లోపం ఏర్పడుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉండడం వల్ల తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ తెగుళ్ల నివారణకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఉద్యాన పంటలను కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి పీవీ రమణ వివరించారు.

సోకే తెగుళ్లు

పాడి-పంట

వరద నీటిలో చిక్కుకున్న కూరగాయ పంటలకు సాధారణంగా ఆకు ముడత, చీడపీడలు, వేరు కుళ్లు, కాండం కుళ్లు తదితర తెగుళ్లు సంభవించే అవకాశం ఉంది. ఉద్యాన పంటలను సస్యరక్షణ చర్యల ద్వారా కాపాడుకోవచ్చు.



పీవీ రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

- **ఆకుముడత:** వరదల వల్ల కూరగాయ మొక్కల ఆకులు ముడుచుకుపోతాయి. అలాగే చీడపీడలు ఆశించినప్పుడు కూడా ఈ తెగులు సోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- **చీడపీడలు:** వరదల వల్ల పొలాల్లో తేమ పెరిగి చీడపీడలు పెరిగి పంటలు నాశనమవుతాయి.
- **వేరుకుళ్లు:** వరద నీరు రోజుల తరబడి పొలాల్లో ఉంటే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ శిలీంధ్ర తెగులు వస్తుంది. కరవు సంభవించిన సమయంలో కూడా ఈ తెగులు ప్రభావం ఉంటుంది.
- **కాండం కుళ్లు:** స్క్లీ రోషియం ఒరైజా అనే శిలీంధ్రం ద్వారా ఈ తెగులు సోకుతుంది. దీనివల్ల కూరగాయల మొక్క కాండం కుళ్లిపోయి పంట తీవ్రంగా దెబ్బతింటుంది.
- **కీటకాల వృద్ధి:** వరదలు సంభవించిన తరువాత ఉద్యాన పంటల్లో ఎక్కువగా ప్రమాదకరమైన బ్యాక్టీరియాతో పాటు అగ్ని చీమలు, దోమలు, బొద్దింకలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కీటకాలు మొక్కల ఆకులను తినేసి పంటను తీవ్రంగా నష్టపరుస్తాయి.



వరద ముంపు తొలగిన తర్వాత కూరగాయల తోటలో నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువ (ఫైల్)



వరద నీటిలో చిక్కుకున్న వివిధ పంటలు (అంతరచిత్రం) తీవ్రంగా దెబ్బతిన్న పంట

నివారణ చర్యలు

- లంక భూమి వాలును అనుసరించి పొలాల్లోంచి వరద నీరు పోయే విధంగా అరడుగు వెడల్పు గల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- నీరు ఇంకిపోయిన తరువాత వీలైనంత మేర నేలను ఆరనివ్వాలి.
- జింక్ లోప నివారణకు 0.2 శాతం జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి. నత్రజని లోప నివారణకు ఒక గ్రాము కార్బన్‌డైజిమ్ లేదా రెండు గ్రాముల కార్బన్‌డైజిమ్‌తో పాటు మాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఇనుము ధాతులోపం నివారణకు 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్‌ను వేయాలి.
- పొటాష్, నత్రజని లోపాల నివారణకు పంట దశను అనుసరించి 0.5 శాతం నుంచి 1.0 శాతం పొటాష్ నైట్రేట్‌ను పిచికారీ చేయవచ్చు.

దొండ సాగుపై ప్రత్యేక శ్రద్ధ

వరదల సమయంలో దొండ సాగు పట్ల ఉద్యాన రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సాధారణంగా వరద నీరు నిల్వ ఉండటం వల్ల దొండ పాదుల్లో చల్లని వాతావరణం ఏర్పడుతుంది. దీనివల్ల ముఖ్యంగా బూజు, బూడిద తెగులు ఆశించే ప్రమాదముంది. బూజు తెగులు నివారణకు మాంకోజెబ్ లేదా మెటాలాక్సిల్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు ట్రైడీమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి వేయాలి.

ఎంపీడీఓలు జాబ్‌చార్ట్‌పై అవగాహన పెంచుకోవాలి



ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ రమణ

సామర్లకోట: ఎంపీడీఓలు తమ జాబ్‌చార్ట్‌పై అవగాహన పెంచుకోవాలని, ఇదే తరుణంలో గ్రామ పంచాయతీలను సొంత వనరులతో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు ఎంపీడీఓలకు నిర్వహించే శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఏలూరు జిల్లాల్లో పదోన్నతి పొందిన 50 మందికి రెండో బ్యాచ్‌లో శిక్షణ జరుగుతుందన్నారు. ఈ మేరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎంపీడీఓలను వైస్ ప్రిన్సిపాల్ పరిచయం చేసుకున్నారు. గ్రామ పంచాయతీలకు సొంత వనరుల సమీకరణ, ఆర్థిక సుస్థిరత ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నిధుల రూపంలో అందిస్తున్న ఆర్థిక సహాయం ఆయా గ్రామ పంచాయతీలకు సరిపోదన్నారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి వివిధ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. పనులు నిర్వహించే సమయంలో మండల పరిషత్తు పాలక మండలి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఎంపీపీల నిర్ణయాలను పాటించాల్సిన పనిలేదన్నారు. ఎంపీడీఓలు విధుల నిర్వహణలో మండల పరిషత్తుకు, ప్రభుత్వానికి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తొలిరోజు ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, డి.శ్రీనివాసరావు, కె.సుశీల శిక్షణ ఇచ్చారు.

ఆటోవాలాలను రోడ్డుకీడ్చారు..

విశాఖ నుంచి అమరావతికి డ్రైవర్ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ఆటోవాలా చింతకాయల శ్రీను

తొండంగి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన కూటమి ప్రభుత్వం ఆటోవాలాలను రోడ్డుకీడ్చిందని విశాఖ కంచరపాలేనికి చెందిన ఆటోవాలా చింతకాయల శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో విశాఖపట్నం నుంచి అమరావతికి పాదయాత్ర సాగిస్తున్నాడు. అతని పాదయాత్ర సోమవారం తొండంగి మండలం జాతీయ రహదారి నుంచి సాగింది. ఈ సందర్భంగా అతను 'సాక్షి'తో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉచిత పథకాలతో పాలనను భ్రష్టు పట్టించిందని ఆరోపించిన కూటమి నేతలు వారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసి ఆటోవాలాల జీవనోపాధిపై దెబ్బకొట్టారన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న యువకులు, మధ్య వయస్కులు ఎందరో ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఫైనాన్స్ కంపెనీలపై ఆధారపడి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి నెలా ఫైనాన్స్ చెల్లించుకుంటూ ప్రభుత్వానికి ట్యాక్స్‌లు, బీమా, అప్పుడప్పుడు ఫైన్లు చెల్లిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ఉచిత బస్సు పథకంతో ప్రస్తుతం ఆటోవాలాలంతా రోడ్డున పడ్డారన్నారు. ఈ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న విశాఖ నుంచి అమరావతికి పాదయాత్ర ప్రారంభించానని, తమ మనోవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకూ పోరాడతానని వివరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

కొత్త కోటపాడులో డయేరియా



కొత్త కోటపాడులో డయేరియా బాధితుల వివరాలు సేకరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రంగంపేట: మండలంలోని కొత్త కోటపాడు గ్రామంలో డయేరియా ప్రబలింది. వాంతులు, విరేచనాలతో పలువురు మంచాన పడ్డారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఆ గ్రామంలో నమోదైన డయారియా కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కొత్త కోటపాడులో ప్రత్యేక వైద్య బృందంతో శిబిరం నిర్వహించి, బాధితులకు చికిత్స అందించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కేసులపై విచారణ జరిపారు. ప్రభావిత ఇళ్లలో పారిశుధ్య చర్యలు చేపట్టగా, నీటిలో క్లోరినేషన్ పనులు చేయించారు. కొత్త కోటపాడులో 234 ఇళ్లలో 973 జనాభా ఉండగా, నాలుగు డయేరియా కేసులు నమోదయ్యాయి. పరిస్థితి నియంత్రణలో ఉందని వైద్యాధికారులు తెలిపారు. వినాయక చవితి ప్రసాదం వల్ల ఫుడ్ పాయిజన్ జరిగి డయేరియా వచ్చి ఉండవచ్చని చెప్పారు.

మాచవరంలో డెంగీ

రాయవరం: మాచవరంలో డెంగీ కేసు నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు సోమవారం ఆ గ్రామంలో సందర్శించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల హైదరాబాద్ నుంచి జ్వరంతో గ్రామానికి వచ్చాడు. మాచవరం పీహెచ్‌సీ డాక్టర్ మణికంఠ సత్యనారాయణను రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా, డెంగీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు, మండపేట సబ్ యూనిట్ అధికారి పీడీడీ బిషప్‌లు ఆ గ్రామాన్ని సందర్శించారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి సూచనలతో దోమల నివారణ మందును కాలువల్లో పిచికారీ చేయించారు.

పొగాకు రైతులు నిరాశ చెందవద్దు

దేవరపల్లి: పొగాకు రైతులు నిరాశ చెందవద్దని మంచి మార్కెట్ ఉంటుందని భారత పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ వివరించారు. దేవరపల్లి వేలం కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పొగాకు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు ధర కిలో రూ.375 పలుకుతుందని తెలిపారు. దేవరపల్లి కేంద్రంలో 10.5 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 12 మిలియన్ల కిలోల ఉత్పత్తి జరిగిందన్నారు. మన పొగాకుకు పోటీనిచ్చే జింబాబ్వే, బ్రెజిల్ దేశాలు చాలా ఎక్కువగా పంటను పండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆఫ్రికా ఖండంలోని ఇతర దేశాల్లో కూడా విపరీతంగా పంటను పెంచడానికి సమాయత్తం అవుతున్నాయన్నారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో పండిస్తున్న ఎన్ఎల్ఎస్ పొగాకు 56 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 80 మిలియన్ల కిలోల ఉత్పత్తి జరిగిందన్నారు. పొగాకు బోర్డు నిర్ణయించిన మేరకే పంట వేసుకోవాలని, రైతులు స్వీయ నియంత్రణ పాటిస్తే మార్కెట్ బాగుంటుందని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ మేనేజర్ జీఎల్కే ప్రసాద్, వేలం కేంద్రం నిర్వహణాధికారి సీహెచ్ హేమస్మిత, రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వీధి ఆవుకు అత్యవసర శస్త్రచికిత్స

ఐదు కిలోల ప్లాస్టిక్ కవర్ల తొలగింపు



వీధి ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు విజయరెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురంలో ఓ వీధి ఆవుకు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి సోమవారం అత్యవసర శస్త్రచికిత్స చేసి, ఐదు కిలోల ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. స్థానిక ఫైర్‌స్టేషన్ వద్ద ఓ వీధి ఆవు కదలేని పరిస్థితుల్లో ఉండి నోరు, ముక్కు వెంబడి తిన్న ఆహారం బయటకు వచ్చేస్తుందని గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు డాక్టర్ విజయరెడ్డికి సమాచారం అందించారు. తక్షణమే ఆయన పశువుల అంబులెన్స్–1962 వాహనంలో తన సిబ్బందితో వీధి ఆవు వద్దకు చేరుకున్నారు. ఆవు పొట్ట ఉబ్బి ఇబ్బంది పడుతున్న సమయంలో డాక్టర్ విజయరెడ్డి తక్షణమే ఆవు కడుపు భాగంలో అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి ఐదు కిలోల ప్లాస్టిక్ కవర్లను తీశారు. ప్రస్తుతం ఆవు ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ తెలిపారు. గో ప్రేమికులు స్వామి, పుల్లయ్య, పశు వైద్య సిబ్బంది వెంకటేష్, యశ్వంత్ తదితరులు సహకారం అందించారు.

డ్రైవర్‌ను కొట్టి నగదు దోపిడీ

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు లారీ డ్రైవర్ కొట్టి, అతని వద్ద ఉన్న నగదును దోచుకుపోయిన సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. రాజమహేంద్రవరం నుంచి సోలాపూర్ వెళ్తున్న లారీని డ్రైవర్ శ్రీషైన్ మెత్రీ ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో దివాన్‌చెరువు పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన ఆపి, డోరు తెరచి ఉంచి క్యాబిన్‌లో నిద్రించాడు. తెల్లవారు జామున 4 గంటల సమయంలో బ్యాటరీ బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు నిద్రపోతున్న శ్రీషైన్ మెత్రీని లేపి, ఇష్టానుసారంగా చేతులతో దాడి చేశారు. అతని జేబులో ఉన్న రూ. 20 వేలతోపాటు సెల్‌ఫోన్‌ను తీసుకుని రాజానగరం వైపు పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు తెలిపారు.

యూరియా బస్తా తీసుకెళ్తుండగా..

కొత్తపేట: రావులపాలెం మండలం దేవరపల్లి శివారు మట్లదొడ్డికి చెందిన కౌలు రైతు అప్పారి సత్యనారాయణ కొత్తపేట వచ్చి యూరియా బస్తా కొనుగోలు చేశాడు. దానిని బైక్‌పై తీసుకు వెళుతుండగా పలివెల వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బీభత్సం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ కారు బీభత్సం సృష్టించింది. స్థానిక ప్రతాప్‌నగర్ నుంచి గాంధీనగర్ వెళుతున్న ఓ కారు సమీపంలో ఉన్న దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏళ్ల పాలకూరి శ్రీనివాసరావు (71)కు గాయాలు కాగా, స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. వాహనం నడిపిన మురళీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధ్యాయుడి అదృశ్యం

అమలాపురం టౌన్: అమలాపురం వడ్డిగూడెం వాసి, ముమ్మిడివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వైదాని వెంకట రమణప్రసాద్ (52) అదృశ్యమయ్యారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఇంట్లోంచి బయటకు వెళ్లిన ప్రసాద్ తిరిగి ఇంటికి రాలేదని పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయుడి కుటుంబీకులు రెండు రోజులుగా అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఉపాధ్యాయుడి భార్య నాగ వెంకట విజయలక్ష్మి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

నల్లజర్ల: వరకట్నం కోసం వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై నల్లజర్ల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా ఉప్పలూరుకు చెందిన పోతురాజు లోకేష్‌కు నల్లజర్లకు చెందిన కృష్ణవేణితో 2020లో వివాహం జరిగింది. వివాహ సమయంలో కృష్ణవేణి తల్లిదండ్రులు కొంత నగదు, బంగారాన్ని కట్నంగా లోకేష్‌కు అందజేశారు. కొన్నాళ్లు సంసారం సాఫీగా సాగినా తర్వాత లోకేష్ మరింత కట్నం కావాలంటూ కృష్ణవేణిని హింసించేవాడు. పెద్దల సమక్షంలో పలుమార్లు పరిష్కరించినా లోకేష్‌లో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో వీరు 2022లో మకాం నల్లజర్లకు మార్చారు. మళ్లీ పాత పద్ధతిలోనే ఆమెను హింసిస్తుండడంతో విసుగు చెందిన కృష్ణవేణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన లక్ష్మీశ్రీసాయిని అభినందిస్తున్న హెచ్‌ఎం షాలిని సౌజన్య

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని ఈఏఆర్ ఎయిడెడ్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న లక్ష్మీశ్రీ సాయి జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఏపీ రాష్ట్ర సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు తరఫున గత నెల 25 నుంచి 30వ తేదీ వరకూ ఛత్తీస్‌ఘడ్, నారాయణపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఆమెను ఎంపిక చేశారు. పాఠశాల కరస్పాండెంట్ కె.ప్రభాకరరావు, హెచ్‌ఎం పి.షాలిని సౌజన్య, ఉపాధ్యాయులు, పీఈటీ సయ్యద్ షఫీ ప్రోత్సాహమే తన విజయానికి కారణమని లక్ష్మీశ్రీసాయి తెలిపింది. సోమవారం పాఠశాల క్రీడా సంఘం నిర్వహించిన సమావేశంలో ఆమెను మెమెంటోతో సత్కరించారు.

స్కానింగ్ సెంటర్ సీజ్



వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: కాకినాడలోని నూకాలమ్మ గుడి సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించిన నేపథ్యంలో స్కానింగ్ సెంటర్‌లో తనిఖీలు చేసి కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు, ఆర్డీఓ మల్లిబాబు సమక్షంలో సీజ్ చేశామని తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారన్న ఓ మహిళ ఫిర్యాదుతో డీఐఓ డాక్టర్ సుబ్బరాజు బృందం తనిఖీలు చేపట్టిందన్నారు. చట్టం ఉల్లంఘించిన నేపథ్యంలో వివరణ కోరగా సమాధానం సంతృప్తికరంగా లేదని వెల్లడించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేశామని డీఎంహెచ్ఓ తెలిపారు.

మభ్యపెట్టి.. చోరీ చేసి

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- రూ.రెండు లక్షలు, బంగారం స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ సూర్యఅప్పారావు, చిత్రంలో ఎస్ఐ శ్రీహరిబాబు తదితరులు

అన్నవరం: కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు, ఆటోలే వారి లక్ష్యం.. అందుకే సాటి ప్రయాణికుల్లా వెళ్తారు.. అందికాడకు దోచుకుంటారు.. ప్రయాణికులను మభ్యపెట్టి వారి బ్యాగుల్లో ఉన్న బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న ఇద్దరు మహిళలను అన్నవరం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.రెండు లక్షలు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 13న కత్తిపూడిలో ఆటోలో వెళ్తున్న ఓ మహిళ దృష్టి మరల్చి ఆమె బ్యాగ్ నుంచి రూ. రెండు లక్షలు అపహరించినట్టు అక్కడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదే విధంగా ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళల నుంచి బంగారం దొంగిలించినట్లు ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కాగా, సోమవారం ఉదయం కత్తిపూడి ఫ్లైఓవర్ దిగువన ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారు ఆ నేరాలు చేసినట్టు అంగీకరించారని సీఐ తెలిపారు. నిందుతులు తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని డ్రైవర్స్ కాలనీ తారకనగరానికి చెందిన తొండ శాంతి, అదే ప్రాంతానికి చెందిన ఆవుల భూలక్ష్మిగా గుర్తించారు. వీరి నుంచి రూ.రెండు లక్షలు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ ప్రత్తిపాడు కోర్టులో హాజరు పర్చనున్నారు.

సందట్లో సడేమియా..

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నేపథ్యంలో హడావుడిలో ఉండగా, కొందరు చేతివాటం ప్రదర్శించి ఆభరణాలు, నగదు అపహరించే వీలుందని సీఐ తెలిపారు. అందువల్ల ప్రయాణ సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు, క్రైమ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు రమణ, శ్రీనివాస్, హోంగార్డు అన్నపూర్ణలను అభినందించారు.